

కర్ణాటక ధాన్యం జిల్లాలోకి రావొద్దు

● కలెక్టర్ సిక్తాపట్నాయక్

కృష్ణ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ధాన్యం నారాయణపేట జిల్లాలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె మండలంలోని గుడెబల్లూరు గ్రామ సమీపంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటు క్వింటాలుపై రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. అనంతరం కర్నాటక రాష్ట్ర సరిహద్దున ఉన్న చెక్ పోస్టును పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో సుదర్శన్, సివిల్ సప్లయ్ అధికారి దేవదాస్, ఏవో జాన్ సుధాకర్ ఉన్నారు.



కృష్ణ చెక్‌పోస్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

● మాగనూరు: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఆరబోసిన వరి ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు.



సీఈఐఆర్ సేవల్లో జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు ఆరో స్థానం 4



అలంకారోత్సవానికి సర్వం సిద్ధం
నేడు కురుమూర్తి బ్రహ్మోత్సవాల్లో తొలి ఘట్టం 5




ఆ టేస్టే వేరు 5
కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్ మసాలా ప్రత్యేకం



వ్యవసాయ క్షేత్రాలా? నీటి అక్రమ వ్యాపార కేంద్రాలా? 5

అడ్డొస్తున్న అహం..
అందని న్యాయం..

● పోలీస్ స్టేషన్‌లలో సమస్య పరిష్కారం కాక ఎస్పీల వద్దకు బాధితులు
● ఎస్పీలు మళ్లీ పీఎస్‌లకే అప్పగింత
● తమను కాదని బాస్ వద్దకు వెళ్తారా? అని బాధితులపై సీనియర్ పోలీసుల ఆగ్రహం
● కౌంటర్ కేసులు పెట్టిస్తున్న కొందరు పోలీసులు
● స్టేషన్ చుట్టూ తిరుగుతున్న బాధితులు
● ఎస్పీల ఆదేశాలు బుట్టదాఖలు
● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌లను శాసిస్తున్న వైట్ కాలర్



మహబూబ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పోలీస్ ఆఫీసర్లుగా చెలామణి అవుతున్న కొందరి తీరు పోలీస్ శాఖకు అప్రతిష్ఠ తెచ్చిపెడుతోంది. బాధితుల కన్నీళ్లకు వారి మనసులు కరగడం లేదు. న్యాయం కోసం ఠాణా మెట్లెక్కినవారిని చెప్పులరిగేలా తిప్పుకోవడం, లేదంటే కౌంటర్ కేసులు పెట్టి బలవంతంగా రాజీ చేయడం, అదీ కుదరకుంటే పెట్టిన కేసు తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారుతోంది. కింది స్టేషన్‌లలో న్యాయం జరుగకపోతే బాస్‌ల దగ్గరికి వెళ్లగా.. మళ్లీ కిందికే పంపాల్సి రావడంతో మమ్మల్ని కాదని ఉన్నతాధికారుల దగ్గరికెళ్తే ఏమీ కాదని కొందరు సీనియర్‌లకు అహం అడ్డొస్తోంది. దాంతో బాధితులకు న్యాయం జరుగకపోగా కొన్ని సందర్భాలలో కౌంటర్ కేసులను ఎదుర్కోవాల్సి వస్తోంది. పోలీసులతో వచ్చిన పంచాయితీ ఎందుకని కొందరు రాజీ కుదుర్చుకుంటుంటే.. (మిగతా 4లో..)

● వనపర్తి జిల్లాలోని ఓ సర్కిల్ పరిధిలో స్కీంల పేరుతో పొదుపు చేసిన సొమ్మును కస్టమర్లకు ఇవ్వకుండా ఎగ్గొట్టినందుకు ఓ బాధితుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పలుమార్లు పోలీసుల చుట్టూ తిరిగినా న్యాయం జరుగకపోవడంతో జిల్లా బాస్‌ను కలిశారు. బాస్ సంబంధిత అధికారిని ఆదేశించి, నెల రోజులు దాటినా ఇప్పటికీ సంబంధిత స్టేషన్ అధికారులు కేసులు పెట్టకపోగా, బాధితులెందరున్నారో అందరినీ తీసుకువస్తేనే చర్యలు తీసుకుంటానని చెప్పడంతో బాధితుడు నోరెళ్లబెట్టాడు. వారిని తీసుకురాలేక, అవసరాల కోసం పోగు చేసుకున్న సొమ్మురాక వేసారుతున్నాడు.

● మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్ సంస్థలో మార్కెటింగ్ జాబ్ చేస్తున్నాడు. ఈయనను అదే సంస్థలో పనిచేసే కొందరు ఉద్యోగంలోంచి తొలగించే ప్రయత్నం చేయగా, అతను వినకపోవడంతో అందరూ కలిసి కిడ్నాప్ చేశారు. వారి చెర నుంచి తప్పించుకుని వచ్చిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలిసిన కిడ్నాపర్లు ఓ మహిళతో తనను వేధింపులకు గురిచేశాడని కౌంటర్ కేసు పెట్టించారు. ఇరువురిపైనా కేసులు నమోదుకావడంతో ఎవరిపైనా చర్యలు తీసుకోకుండా కేసును పెండింగ్‌లో ఉంచారు. కిడ్నాప్‌నకు గురైన బాధితుడు తనను కిడ్నాప్ చేసి, హత్యకు ప్లాన్ చేశారని కిందిస్థాయి పోలీస్ అధికారుల చుట్టూ తిరిగి, చివరకు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ నుంచి స్టేషన్‌కు ఫిర్యాదు పంపించి రెండు నెలలవుతున్నా ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.



పంట కాదు చెరువు

ఈ ఫొటో చూస్తుంటే.. ఇదేదో పంట అనుకుంటున్నారా? కాదు. ఇది చెరువుపై పేరుకున్న గుర్రపు డెక్క. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామ శివారులో ఉన్న జగత్‌పల్లి చెరువులో గుర్రపు డెక్క ఇలా పేరుకుపోయింది. చూడగానే పంటలా కనిపిస్తోంది. 'ఆంధ్రజ్యోతి' మంగళవారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



న్యూస్ బాక్స్

నేటి నుంచి ఒంటిపూట బడులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా బుధవారం నుంచి ప్రారంభించనున్న సర్వే నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు నేటి నుంచి ఒంటి పూట బడులు నిర్వహించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని సెకండరీ గ్రేడ్ టీచర్స్ సర్వేలో పాల్గొననున్నందున ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నా 12:15 వరకు తరగతులు నిర్వహించి, తర్వాత ఒంటి గంట భోజనం పెట్టించి విద్యార్థులను పంపిస్తారు. జిల్లాలో 1300 మంది సెకండరి గ్రేడ్ టీచర్స్ ఉండగా, 1,150 మంది సర్వే విధుల్లో పాల్గొననున్నారు.



విజయం సాధించిన మహబూబ్‌నగర్ జట్టు

హెచ్‌సీఏ టోర్నీలో మహబూబ్‌నగర్ గెలుపు

● 4 వికెట్లు తీసిన ముఖిదుద్దీన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించింది. వరంగల్ టీవీవీఎస్ స్టేడియంలో మంగళవారం మహబూబ్‌నగర్, వరంగల్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 22.3 ఓవర్లలో 81 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అబ్దుల్ రాఫె 11, అక్షయ్ 12, షాదాబ్‌అహ్మద్ 25 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 26.3 ఓవర్లలో 72 పరుగులకు ఆల్‌ఔట్ అయ్యింది. మహబూబ్‌నగర్ జట్టు బౌలర్లలో ముఖిదుద్దీన్ 10 ఓవర్లు వేసి 3 మెడిన్లు, 8 పరుగులు ఇచ్చి, 4 వికెట్లు తీసి జట్టు గెలుపునకు కృషి చేశాడు. ప్రణీత్‌రెడ్డి, 2, అరవింద్ 1, జశ్వంత్ 1 వికెట్ తీశారు. జిల్లా జట్టు విజయం సాధించడం పట్ల జట్టు క్రీడాకారులను, కోచ్ అబ్దుల్లాను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు.

న్యూస్ బాక్స్

కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు సీఎం రాక

● ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 11న మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలో వెలిసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి ఆలయానికి రానున్నారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం రానున్నందున జాతర మైదానంలో సీఎం పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి హెలిప్యాడ్ కోసం స్థలాన్ని చూశారు.

పశుసంపద పరిరక్షణే ధ్యేయం

● జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నారాయణపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో పశుసంపద పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్నామని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి బి.ఈశ్వర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

జిల్లాలో గొర్రెలు, మేకలు ఎన్ని ఉన్నాయి? పీపీఆర్ టీకాలు ఎప్పుడు వేస్తారు?

జిల్లా వ్యాప్తంగా 13 లక్షల గొర్రెలు, లక్షా 26 వేల మేకలు ఉన్నాయి. డిసెంబరు ప్రారంభంలో పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఉదయం వేళ వేస్తారు. అందుకోసం 26 బృందాలను ఏర్పాటు చేశాం.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఎంత వరకొచ్చింది?

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏటా రెండు సార్లు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం. ఈ నెల 15తో ఈ కార్యక్రమం ముగుస్తుంది. జిల్లాకు 80 వేల డోసులు రాగా, ఇప్పటి వరకు 60 శాతం 52,536 పశువులకు టీకాలు వేశాం. 15వ తేదీ లోపు వంద శాతం డోసులు వేస్తాం. 25 అధికారుల బృందాలు టీకాలు వేస్తున్నాయి.



ఈశ్వర్‌రెడ్డి

జిల్లాలో పశువైద్యులు ఎంత మంది ఉన్నారు? ఏ మేరకు సేవలు అందుతున్నాయి?

జిల్లాలో 16 పశు ప్రాథమిక వైద్య కేంద్రాలు ఉన్నాయి. ఇదివరకు ఐదు మంది వైద్యులు జిలాల్‌పూర్, నారాయణపేట, మరికల్, దామరగిద్ద, మద్దూర్‌లలో పని చేసేవారు. కోస్గి, హిందుపూర్, మాగనూర్, జెక్లేర్, నర్వ, పెద్దకడ్మూర్, చిన్నపొర్లకు కొత్త వైద్యులు వచ్చారు. ఊట్కూర్, కర్ని పశు వైద్య కేంద్రాలలో డాక్టర్లు జాయిన్ కావల్సి ఉంది. పశువైద్య సబ్ సెంటర్లు 20 ఉన్నాయి. ఉన్న సిబ్బంది, డ్యిప్యుటేషన్స్‌తో మెరుగైన సేవలు అందిస్తున్నాం.

పశుగణన సర్వే ఎప్పుడు ప్రారంభం అవుతుంది?

ఐదేళ్లకోమారు పశుగణన సర్వే జరుగుతుంది. జాతీయ స్థాయిలో దేశవ్యాప్తంగా జరిగే 21వ అఖిల భారత పశుగణన సర్వే ఈ నె 16 నుంచి ప్రారంభం కానుంది. నాలుగు నెలల పాటు జరిగే ఈ సర్వే కోసం 37 మంది ఎన్యుమరేటర్లను నియమించాం. సర్వే కోసం కేంద్రం ట్యాబ్‌లను త్వరలో అందించనుంది. ఎస్‌ఎస్‌జీ రకం గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారు తీసుకోవచ్చు.



గజ వాహన సేవ

మహబూబ్‌నగర్ జిల్లా కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి మంగళవారం రాత్రి గజవాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయం మారుమోగింది.

- చిన్నచింతకుంట

ఏటీఎంల వద్ద అప్రమత్తంగా ఉండాలి



మక్తల్‌లో బ్యాంకు వద్ద ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి

నారాయణపేట న్యూటౌన్/మక్తల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగదు విత్‌డ్రా కోసం ఏటీఎంల వద్దకు వెళ్లే ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని పేట సీఐ శివశంకర్ అన్నారు. మంగళవారం నారాయణపేటలోని ఎస్‌బీఐ, యూనియన్, కెనరా బ్యాంకుల పరిసరాల్లో ఉన్నవారిని ఫింగర్ ప్రింట్స్, డివైస్‌తో అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బ్యాంకు ఖాతాదారులకు పలు సూచనలు చేశారు. ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అదేవిధంగా, మక్తల్‌లోని ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల వద్ద మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి ఖాతాదారులకు బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి నగదు ఇంటికి తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అపరిచితుల మాటలను నమ్మవద్దన్నారు.

హాస్టల్ విద్యార్థి అదృశ్యం

నవాబ్‌పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ విక్రం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మరికల్ ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో నందకుమార్(11) ఆరో తరగతి చదువుతున్నాడు. సోమవారం అందరితో కలిసి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి హాస్టల్‌కు రాలేదు. దాంతో వార్డెన్ నరేందర్‌రెడ్డి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆచూకీ తెలియకపోవడంతో వార్డెన్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



బాలుర జట్టుకు షీల్డును అందిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, స్వాప్ చైర్మన్ శివసేనారెడ్డి

కబడ్డీలో ఘన విజయం

అడ్డాకుల, నవంబరు 5: మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం రాచాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ 68 అండర్ 19 బాలుర, అండర్ 17 బాలికల విభాగాల్లో మహబూబ్‌నగర్ జట్లు విజయం సాధించాయి. విజేతలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, స్వాప్ చైర్మన్ శివసేనారెడ్డి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ రూ.364 కోట్లు కేటాయించిందని తెలిపారు. జిల్లాలో స్పోర్ట్స్ యూనివర్సిటీ, నియోజకవర్గంలో ఇండోర్ స్టేడియం నెలకొల్పడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు త్వరలో సీఎం కప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో అండర్ 19 బాలుర విభాగంలో హైదరాబాద్, అండర్ 17 బాలికల విభాగంలో ఖమ్మం ద్వితీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో డీఈవో రవీందర్, ఏఎంవో శ్రీనివాస్, సీఎంవో బాలుయాదవ్, ఎంఈవో ఎం.కురుమూర్తి పాల్గొన్నారు.



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని(ఎడమ నుంచి మొదటి బాలిక)తో ఉపాధ్యాయులు

పరుగు పోటీలో గోల్డ్ మెడల్

● రాష్ట్ర స్థాయికి ఎంపికైన గార్లపాడ్ విద్యార్థిని

కోయిలకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్ 14.. 100 మీటర్ల పరుగు పోటీల్లో గార్లపాడ్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని నవ్యశ్రీ మొదటి స్థానంలో నిలిచి, గోల్డ్ మెడల్ సాధించిందని పీఈటీ ఉమాపతిరెడ్డి మంగళవారం తెలిపారు. ఆమె ఈ నెల 8న ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. నవ్యశ్రీ మెడల్ సాధించడంపై ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రకృతి సేద్యం.. జీవన మార్గం

- సేంద్రియ వ్యవసాయంలో మహిళా రైతు
- కృషిరత్న పురస్కారం అందుకున్న లావణ్య
- భర్త రమణారెడ్డి సహకారంతో పంటల సాగు


సేంద్రియ పద్దతిలో సాగు చేసిన పత్తి పంట(ఫైల్)

తెలకపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని కార్వంగకు చెందిన రైతు లావణ్య 20 సంవత్సరాలుగా సేంద్రీయ పద్ధతిలో పంటలను సాగు చేస్తూ, విజయం సాధిస్తున్నారు. ఆమె గతంలో ఎంపీటీసీ సభ్యురాలిగానూ పని చేశారు. మొదట్లో వారు కూడా అందరిలాగానే రసాయనిక ఎరువులతో పంటలు పండించే వారు. దీంతో భూసారం తగ్గిపోయి పంటలు సరిగా పండక నష్టాలపాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు కొంత భూమిని అమ్ముకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత వారికి సేంద్రియ వ్యవసాయంతో పరిచయం కలిగింది. ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ శిక్షణ శిబిరాల్లో పాల్గొన్నారు. సేంద్రియ సాగుపై అవగాహన పెంచుకొని, అదే తమ జీవన మార్గంగా ఎంచుకున్నారు. భర్త రమణారెడ్డితో కలిసి పొలంలో వరి, పత్తి, మిరప, మొక్కజొన్న తదితర పంటలు పండిస్తున్నారు. మొదట 2002లో కనకాంబరం తోటను వేసి, మంచి లాభాలు గడించారు. ప్రస్తుతం ఎకరం పొలంలో మిరప తోట సాగు చేయగా, మూడు కోతల్లో 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ఆమె తెలిపారు. అంతర్‌పంటుగా ఆవాలు, ధనియాలు, మెంతులు, వేరుశనగ తదితరాలను పండించామని చెప్పారు. వ్యవసాయ రంగంలో ఆమె చేసిన కృషికి గుర్తింపుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక పురస్కారాలను అందుకున్నారు. శ్రీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ నుంచి కృషి రత్న పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో పాటు, ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అభినందనలు కూడా అందుకున్నారు. పూర్వ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. అంతే కాకుండా ఆసక్తి ఉన్న రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. సాగులో మెళకువలు, జీవామృతం, ఘన జీవామృతం తయారీ పద్ధతులను నేర్పిస్తున్నారు.


భర్తతో కలిసి జీవామృతం తయారు చేస్తున్న లావణ్య(ఫైల్)


మాజీ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న లావణ్య(ఫైల్)

అడ్డొస్తున్న అహం.. అందని న్యాయం..


మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయం

(మొదటి పేజీ తరువాయి)

మరికొందరు కోర్టులను, మానవహక్కుల సంఘాలను ఆశ్రయిస్తున్నారు. కింది స్టేషన్‌లలో న్యాయం జరుగకపోతే తమను సంప్రదించాలని ప్రతీ సోమవారం ఆయా జిల్లాల ఎస్పీలు బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నారు. సమస్యలు విని వెంటనే పరిష్కరించాలని ఆయా స్టేషన్‌లకు పంపిస్తున్నా, అవి ఈమేరకు పరిష్కారం అవుతున్నాయో క్రాస్ చెక్ చేసుకోవడం లేదు. దాంతో సోమవారం తీసుకుంటున్న ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయి. ఒకసారి ఎస్పీలను కలిసిన బాధితులు మళ్లీ వారి దగ్గరికి వెళ్లే సాహసం చేయక, చివరికి వైట్ కాలర్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పలువురు పోలీస్ అధికారులు సివిల్ కేసులపై చూయిస్తున్న ఆసక్తి.. సామాన్యులకు కేసులపై చూపకపోవడం గమనార్హం.

పీఎస్‌లలో న్యాయం జరగకనే ఎస్పీల వద్దకు

బాధితులెవరైనా కింద స్థాయి పోలీస్ స్టేషన్‌లలో న్యాయం జరుగడం లేదని నిర్ధారణకు వచ్చిన తరువాతనే , సర్కిల్ అధికారి, డీఎస్పీ, ఆ తరువాత ఎస్పీలను కలుస్తారు. ప్రతీ సోమవారం ఎస్పీలు ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా సమస్యలను స్వీకరిస్తున్నారు. ఎస్పీలే నేరుగా ఫిర్యాదులు తీసుకుని, సమస్యలు వింటున్నారంటే తమకు తప్పక న్యాయం జరుగుతుందని బాధితులు నమ్ముతారు. అయితే బాస్‌లు బాధితుల సమస్యలను ఓపిగ్గానే వింటున్నారు. వాటి పరిష్కారం కోసం అధికారులకు లిఖితపూర్వక లేదా మౌకిక ఆదేశాలు ఇస్తున్నారు. కానీ.. ఎస్పీల నుంచి మళ్లీ స్టేషన్‌లకే ఆ ఫిర్యాదులు వెళ్తుండటంతో సమస్య ఎక్కడ మొదలైందో మళ్లీ అక్కడికే చేరుతోంది. దాంతో తమను కాదని పైస్థాయి అధికారులను కలుస్తారా? అని కొందరు సీనియర్ పోలీసుల ఇగో హర్ట్ అవుతోంది. అక్కడికి వెళ్లినా మళ్లీ మావద్దకే వచ్చేదంటూ వారు పలు ఫిర్యాదులను పక్కన పెడుతున్నారు. మరికొందరైతే తమ మాట వినలేదంటూ నిందితులనే పిలిచి వారి చేత కౌంటర్ ఫిర్యాదు చేయించి, కౌంటర్ కేసులు పెడుతున్నారు. దీంతో బాధితుడు కాస్త నిందితుడుగా మారుతున్నాడు. అన్ని కేసుల్లో ఇలానే ఉండదు. ఎస్పీలు ఆదేశించిన చాలా కేసులను పలువురు అధికారులు పరిష్కరిస్తున్నా, కొందరు మాత్రం ఇగోకు తీసుకోవడం వల్ల బాధితులకు తిప్పలు తప్పడం లేదు.

● మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ మండలానికి చెందిన రైతు తాను కొనుగోలు చేసిన పొలంలో పంట సాగు చేశాడు. దాయాదులు ఇది తమ పొలం అంటూ వేసిన పంటను పాడు చేశారు. దాంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, వదిలేశారు. ఆ తరువాత కూడా దాయాదులు ఆ పొలంలో ఎలాంటి పనులూ చేయకుండా ఆటంకాలు కలిగిస్తున్నారు. ఈ విషయమై బాధిత రైతు పదేపదే పోలీసుల చుట్టూ తిరిగినా చర్యలు లేకపోవడంతో చివరికి ఎస్పీని ఆశ్రయించారు. నెలదాటినా ఇప్పటివరకు కనీసం వారిని పోలీసులు పిలిచి మాట్లాడలేదంటే జిల్లా బాస్‌ల ఆదేశాలను ఏమేర పాటిస్తున్నారో ఇట్టే అర్థమవుతోంది.

ఫిర్యాదులపై బాస్‌లు దృష్టి సారించాలి

తమ వద్దకు వచ్చిన బాధితులందరికీ న్యాయం చేస్తున్నామనే ఎస్పీలు భావిస్తున్నారు. అయితే తమ వద్దకు వచ్చిన ఫిర్యాదులపై కింది స్థాయిలో బాధితులకు ఏమేర న్యాయం జరిగిందో ఫోన్ చేసి, క్రాస్ చెక్ చేసే సిస్టమ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇది వరకు కొంతమంది అధికారులు కార్యాలయ సిబ్బందిచేత బాధితులకు ఫోన్ చేయించి, మీ ఫిర్యాదు పరిష్కారం అయిందా? అని అడిగి వివరాలు సేకరించేవారు. ఈ రిపోర్ట్‌ను ఎస్పీలకు అందజేసేవారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో అధికారులకు భయం ఉండేది. ఇప్పుడు ఇలాంటి సిస్టమ్ లేకపోవడంతో పోలీస్ స్టేషన్ అధికారుల నిర్ణయమే ఫైనల్ అన్నట్లుగా మారింది. బాధితులు ఒకసారి ఎస్పీలను కలిశాక రెండోసారి మళ్లీ వారిని కలిసేది చాలా తక్కువ. ఎస్పీలను కలిసిన తరువాత కూడా న్యాయం జరుగలేదంటే పోలీస్ వ్యవస్థ ఇంతే అన్న నిర్ణయానికి వచ్చి సర్దుకుపోతుంటారు. కొందరైతే కోర్టులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారు. అందుకే ఎస్పీలు తమ వద్దకు వచ్చిన ఫిర్యాదులను నెలకోసారి ర్యాండమ్‌గా ఏమేర పరిష్కారం అయ్యాయో ఓ విభాగం ఏర్పాటు చేసి, క్రాస్ చెక్ చేయిస్తే బాధితులకు న్యాయం జరగడంతోపాటు పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది.

సీఈఐఆర్ సేవల్లో
జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు ఆరో స్థానం


డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి

- జడ్చర్ల సీఐ ఆదిరెడ్డిని ప్రశంసించిన డీజీపీ జితేందర్

జడ్చర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) సేవల్లో జడ్చర్ల పోలీస్ స్టేషన్ రాష్ట్ర స్థాయిలో ఆరో స్థానంలో నిలిచింది. చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ల వివరాలతో బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 459 మొబైల్‌ఫోన్‌లను రికవరీ చేసినందున జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు ఆ స్థానం దక్కింది. రికవరీ చేసిన మొబైల్‌ఫోన్‌లను సంబంధిత వ్యక్తులకు అప్పగించి, ప్రజలకు మంచి సేవలను అందించినందుకు సీఐ ఆదిరెడ్డిని డీజీపీ జితేందర్ అభినందించడంతో పాటు ప్రశంసా పత్రం అందించారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఐ ఆదిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఐపీఎస్‌లు మహేష్‌భగవత్, షికాగోయల్ ఉన్నారు. ఈ సందర్భంగా జడ్చర్ల సీఐ, సిబ్బందిని ఎస్పీ జానకి అభినందించారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

- తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

నారాయణపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానం అమలు చేయాలని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నారాయణపేట జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్కు వద్ద మంగళవారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్‌సీలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత ఫించన్ విధానం అమలు చేయాలని తెలిపారు.

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 317 జీవో వల్ల నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలన్నారు. తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, సీతారాములు, నర్సింగప్ప, జ్యోతి, విజయ, నర్మద, విజయలక్ష్మీ, గౌరి, లక్ష్మణ్‌తో పాటు, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో రెండు మేకలు మృతి

- నారాయణపేట జిల్లా గనిమోని బండలో ఘటన

నారాయణపేటరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా బండగొండ పంచాయతీ పరిధిలోని గనిమోని బండలో మేకల కాపరి వెంకటప్పకు చెందిన రెండు మేకలు సోమవారం రాత్రి చిరుత దాడిలో మృతి చెందాయి. కాపరి వెంకటప్ప, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మేకలను అడవిలో మేపి ఇంటికి వచ్చే సమయంలో అకస్మాత్తుగా జీవాలపై చిరుత దాడి చేసింది. దీంతో మేకలు చెల్లాచెదురై రెండు తప్పిపోయాయి. వాటిని కాపరి వెతకగా మంగళవారం ఉదయం గ్రామ శివారులో చనిపోయినట్లు గుర్తించాడు. వాటి విలువ దాదాపు రూ.18వేలు ఉంటుందని కాపరి వాపోయాడు. నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

- 5.3 తులాల బంగారం, 35 తులాల వెండి
- రూ, 3,71,000 విలువైన వస్తువులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎన్.లింగయ్య


కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

మరికల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మరికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ ఎన్.లింగయ్య అన్నారు. మరికల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. మరికల్ గ్రామానికి చెందిన ముడావత్ హన్మంతు అనే వ్యక్తి ఐదు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగ జరుపుకునేందుకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. పండుగ అనంతరం రెండవ తేదీన తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉంది. అందులోని మూడు మాసాల బంగారు కమ్మలు, 20 తులాల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు వారు మరికల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు, విచారణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మక్తల్ మండలం చందాపూర్ గ్రామానికి చెందిన పాత నేరస్థుడు తమ్మిరెడ్డి (45) మరికల్ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. తాను మక్తల్ మండలం వడ్వాట్ గ్రామానికి చెందిన కోల్పూర్ నరసింహ (40)తో కలిసి చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడిని కూడా పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. ఆయన గత సంవత్సరం మరికల్ మండలం పూసల్‌పహాడ్ గ్రామంలో ఒక ఇంట్లో బంగారు కమ్మ బుట్టలు, వెండి వస్తువులు, 20 వేల రూపాయలు చోరీ చేసినట్లు చెప్పాడు. అలాగే మరికల్ గ్రామంలోని మరో ఇంట్లో బంగారు మకర కుందనాలు, కమ్మబుట్టలు, ఉంగరం, చైన్, గుండ్లు, రెండు గాజులు, ఐదు వేల రూపాయలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు ఆభరణాలు, నగదును రికవరీ చేశారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేధించడంలో ప్రతిభ చూపిన సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ మురళిని డీఎస్పీ అభినందించారు. విచారణ బృందం సభ్యులు రవీందర్, తిరుపతి రెడ్డిలకు క్యాష్ రివార్డులను అందించారు.

బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి
ఫిట్స్‌తో మృతి

పెద్దకొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి బహిర్భూమికి వెళ్లి ఫిట్స్ వచ్చి చెట్ల పొదల్లో సోమవారం చనిపోయిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ కథనం ప్రకారం వివరాలిలా... బల్మూరు మండలం జిన్‌కుంట గ్రామానికి చెందిన దళిత జిన్కుంట ఎల్లయ్య కుమారుడు గాలయ్య (42)తన పని మీద 20 రోజుల క్రితం జిన్‌కుంట నుంచి పెద్ద కొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామానికి వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నాడు. అతనికి తరచుగా ఫిట్స్ వచ్చేది. గాలయ్య సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి తన ఇంటికి సమీపంలో ఫిట్స్ రావడంతో కిందపడి ఎవరూ చూడకపోవడంతో అక్కడే ప్రాణాలు విడిచాడు. మంగళవారం ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో ఇంటికి సమీపంలోని చెట్లలో గాలయ్య మృతదేహం కనిపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై మృతుని తల్లి జిన్‌కుంట ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుట్టను తవ్వేస్తున్నారు


బెల్లం గుట్ట వద్ద తొలగించిన రాళ్లు

ఊర్కొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనుమతుల పేరుతో గుట్టను తవ్వేస్తున్నారు. రోజు రోజుకు గుట్టలు తరిగి పోతున్నాయని పరిసర గ్రామాల ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఊర్కొండ మండలం ఊర్కొండపేట, నర్సంపల్లి గ్రామాలు పచ్చటి పొలాల మధ్య ఉన్న గుట్టలు చూసి మురిసిపోయేవారు. పదేళ్లగా రోజురోజుకు గుట్టలు తరగిపోతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నర్సంపల్లి శివారులో బెల్లంగుట్టపై మైనింగ్ వ్యాపారుల కన్నుపడింది. వారు పదేళ్ల క్రితం రెండు హెక్టార్ల వరకు అనుమతులు పొందారు. కానీ దానికంటే అధికంగా తవ్వేస్తున్నా అధికారులు నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

బెల్లం గుట్టపై బ్లాక్‌లు (పెద్దదిండ్లు) తయారు చేసి భారీ వాహనాల్లో హైదరాబాద్ తరలించి వాటిని గ్రానైట్‌గా మలుచుతున్నారు. ఒక బ్లాక్ లక్షల రూపాయల ధర పలుకుతుందని అక్కడ పని చేస్తున్న కార్మికుల ద్వారా తెలుస్తోంది. ఇలా మైనింగ్ అధికారులు ఇష్టానుసారంగా అనమతులు ఇవ్వడంతో వడ్డెర జీవితాలు ఇబ్బందిగా మారుతాయని, బ్లాక్‌ల వల్ల లక్షల అదాయం ఉండటంతో దళారులు పరిసర గుట్టలపై కన్నేసి అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారని వడ్డెర సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. దళారులకు మైనింగ్ అధికారులు వత్తాసు పలికి మైనింగ్ చేయడానికి అనుమతులు ఇస్తే వడ్డెర జీవితాలు బజారున పడుతాయని అవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్లం గుట్టను అనుమతుల కంటే ఎక్కువగా ధ్వంసం చేస్తున్నా మైనింగ్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు



ప్రకృతిపరంగా మా గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణం ఉండేది. పది సంవత్సరాలుగా బెల్లం గుట్టకు అనుమతులు తీసుకున్నామని కొందరు రాత్రింబవళ్లు పెద్ద పెద్ద బ్లాక్‌లను తయారు చేసి సదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో రోజు రోజుకి గుట్టలు తరగిపోతున్నాయి. అధికారులు పర్యవేక్షణ చేసి అనుమతుల కంటే అధికంగా తవ్వుతున్న వ్యాపారి అనుమతులు రద్దు చేయాలి.

- బొల్గం మల్లేష్‌గౌడ్, రైతు, ఊర్కొండపేట

గుర్తు తెలియని యువకుడి
మృతదేహం లభ్యం

అచ్చంపేటటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పట్టణంలోని పాతబజారు చింతల్ బస్తీలో గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైనట్లు అచ్చంపేట ఎస్ఐ రమేష్ తెలిపా రు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని చింతల్‌బస్తీలో పాడుబడిన ఇంట్లో మృతదేహం ఉన్నట్లు కాలనీలోని కొంతమంది స్థానిక పోలీసులకు, సమాచారం ఇచ్చారు. పోలీ సులు వెంటనే కాలనీలోని పాడుబడి, ఎవరూలే ని ఇంట్లో మృతదేహాన్ని పరిశీలించి అచ్చంపేట ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించారు. యువకునికి దాదాపు 35 సంవత్సరాలు ఉన్నట్లు నీలం, తెలుపు గీతల చొక్కా, ఎరుపు రంగు డ్రాయర్ వెసుకొని ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వ్యక్తులు 8712657732 ఫోన్‌నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పీజీ కళాశాల హాస్టల్‌లో భోజన వసతి కల్పించాలి

- పీయూ వీసీకి బీఆర్ఎస్‌వీ నాయకుల వినతి


పీయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్‌వి నాయకులు

కొల్లాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పీజీ కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు భోజన వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌కు బీఆర్ఎస్‌వీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొల్లాపూర్ పీజీ సెంటర్‌ను సందర్శించిన పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌ను బీఆర్ఎస్‌వీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు శేఖర్ మాట్లాడుతూ పాలమూరు విశ్వవిద్యాలయానికి దూర ప్రాంతాల నుంచి చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులకు హాస్టల్లో భోజనం కల్పించకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. హాస్టల్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు భోజన సౌకర్యం లేదని కావునా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని భోజనం వసతి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కళాశాల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కలర్ మహేష్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు భరత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

అలంపూర్ చౌరస్తా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం బొంకూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్ కథనం.. గ్రామానికి చెందిన మాధవి కూలి పని నిమిత్తం పక్క గ్రామమైన చిన్నపోతులపాడు గ్రామానికి పత్తి తీసేందుకు వచ్చింది. ఉన్నట్టుండి ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో పొలం యజమాని రాయచూర్ రోడ్డు వద్ద వదిలిపెట్టాడు. అలంపూర్ చౌరస్తా వైపు వెళ్లే ఆటోలో వెళ్లినట్లు పెట్రోల్ పంపు వద్ద ఉన్న సీసీ పుటేజీలో రికార్డు అయింది. కానీ సమీప గ్రామాల్లో విచారించినా ఆచూకీ కనబడటం లేదని భర్త రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చేందుకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ

వనపర్తి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని లక్ష్మమ్మ, జిల్లా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ కాలేజీ, విద్యార్థులకు మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళ సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహం నిర్మూలన, బాలల చట్టాలు, హక్కుల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్య క్రమానికి జిల్లా సంక్షే మ అధికారి లక్ష్మమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ను బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చాలని, అందుకు అందరు కృషి చేయాలని పేర్కొన్నారు. బాలికలు బాగా చదువుకుంటే ఉన్నతమైన స్థా నాల్లో స్థిరపడవచ్చని బాల్య వివాహాలు చేసుకోవడంతో వారి బంగారు భవిష్యత్ పాడవుతుందని అవగాహన కల్పించారు. అదే విధంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ భాస్కర్, స్పెషలిస్టు ఇన్ ఫైనాన్షియల్ లిట్రసి సుమ మాట్లాడారు. అమ్మాయిలు ముఖ్యంగా సోషల్ మీడియాలో తగు జాగ్రత్తలు తీసు కోవాలని వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో వారి వ్యక్తిగత సమాచారాన్ని, ఫొటోలను షేర్ చేయకూడదన్నారు. సైబర్ నేరాలు ఎక్కడైనా జరిగితే ఎవరన్న ఇబ్బంది కలిగిస్తే.. టోల్ ఫ్రీ నంబరు 1098, 181, 14567, 1930 ఫోన్ చేయాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ భాస్కర్, స్పెషలిస్టు ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి


మృతదేహానికి నివాళి అర్పిస్తున్న గువ్వల బాలరాజు

అచ్చంపేటటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని సింగారం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వర్థం ఆంజనేయులు (35)గత కొంత కాలంగా అనార్యోగ సమస్యతో బాధపడుతున్నారు. అనార్యోగంతో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పరామర్శించారు. మృతుని కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. మృతుని భార్య సరిత ఇద్దరు కుమారులు ఉన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో

ఉమ్మడి జిల్లా జట్టుకు రజతం



రజత పతకం సాధించిన జిల్లా జట్టుతో అసోసియేషన్ సభ్యులు

జడ్చర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు రజత పతకం సాధించింది. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్ ఆదర్శ స్పోర్ట్స్ బాలికల పాఠశాల ఆవరణలో ఈనెల రెండు నుంచి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వరంగల్లు, కరీంనగర్, మెదక్, నల్గొండ జిల్లాల జట్లపై పాలమూరు జట్టు విజయం సాధించి, సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీ ఫైనల్‌లో రంగారెడ్డి జిల్లా జట్టుపై గెలిచి ఫైనల్‌కు చేరింది. తుది పోరులో ఆదిలాబాద్ జిల్లా జట్టుతో హోరాహోరీగా తలపడి 17 - 23 స్కోర్‌తో రన్నర్‌గా నిలిచిందని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తఖి యొద్దీన్, శంకర్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్, ఎస్జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి అభినందించారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు



పోటీల్లో విజేతలైన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా అండర్ - 14, 17 అథ్లెటిక్స్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో పాలమూరు పట్టణంలోని స్టేడియం మైదానంలో మంగళవారం ఈ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు రమణ, ఆనంద్, కృష్ణయ్య, మెర్సీ మేరీ పుష్ప, ఉమాదేవి పాల్గొన్నారు.



నేడే అలంకారోత్సవం

కురుమూర్తి బ్రహ్మోత్సవాల్లో తొలి ఘట్టం



చిన్నచింతకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధానమైన కురుమూర్తి స్వామి అలంకారోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఆత్మకూరు ఎస్‌బీఐ నుంచి ఊరేగింపు

కురుమూర్తి వేంకటేశ్వర స్వామికి ముక్కెర వంశపు రాజులు పలు స్వర్ణాభరణాలను సమర్పించారు. అందులో కిరీటం, కోరమీసం, హస్తాలు, భుజకీర్తులు, శంకు చక్రాలు, పచ్చలు, వజ్ర వైఢూర్యాలు పొదిగిన హారాలు, ముత్యాల హారాలు, మొలగజ్జెలు ఉన్నాయి. ఈ ఆభరణాల పెట్టెను ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాల అనంతరం వనపర్తి జిల్లా ఆత్మకూర్ ఎస్‌బీఐలోని లాకర్లో భద్రపరుస్తారు. అలంకారోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో ఆభరణాల పెట్టెను లాకర్‌లో నుంచి బయటకు తీసుకొస్తారు. అక్కడి నుంచి ఊరేగింపు ప్రారంభం అవుతుంది.

ఊరూరా ప్రత్యేక పూజలు

ఊరేగింపులో గాడీ వంశీయులైన స్వర్ణకారులు ఆభరణాల పెట్టెను తలపై పెట్టుకుని ముందు నడుస్తారు. భారీ పోలీసు బందోబస్తు, భక్తుల గోవింద నామస్మరణ, మంగళ వాయిద్య ఘోష నడుమ ఊరేగింపు కొనసాగుతుంది. ఆభరణాల ఊరే గింపుకు ప్రతీ గ్రామంలో భక్తులు ఘన స్వాగతం పలి కి పూజలు చేస్తారు. ఆత్మకూరు పట్టణం నుంచి పరమే శ్వరస్వామి చెరువుకట్ట మీదుగా మదనాపురం మండలం కొత్తపల్లికి ఊరేగింపు చేరుకుంటుంది. అక్కడి నుంచి దుప్పల్లి మీదుగా మధ్యాహ్నం సమయానికి చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామంలోని ముక్కెర వంశస్థుడు రాజా రాంభూపాల్ నివాసానికి చేరుతుంది. అక్కడ భక్తులతో పాటుగా వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆభరణా లను దర్శించుకుంటారు. వేద పండితు లు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత మళ్లీ ఊరేగింపు ప్రారంభం అవుతుంది.



అమ్మాపూర్ మీదుగా జాతర మైదానానికి...

భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఊరేగింపు అమ్మాపూర్ గ్రామం మీదుగా సాయంత్రం సమయానికి కురుమూర్తి జాతర మైదానానికి చేరుకుంటుంది. అనంతరం దేవరగట్టు మెట్ల వద్ద ఆలయ అర్చకులు, వేద పండితులు, ప్రముఖులు ఆభరణా లకు ఘన స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత ఆభరణాల పెట్టెను గుట్టపై నున్న కాంచన గుహకు చేరుస్తారు. అనంతరం స్వామి వారికి ఆభరణాలను అలంకరిస్తారు. కార్యక్రమానికి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసన సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, దేవాదాయ శాఖతో పాటుట ఇతర ఉన్నతాధికారులు హాజరు కానున్నారు.

ఆ టేస్టే వేరు!

- కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్ ప్రత్యేకం
- స్పెషల్ మసాలా కలపడమే అందుకు కారణం
- అమరచిత ఆరెకటికల ప్రత్యేక తయారీ

అమరచింత, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రతీది ఓ ప్రత్యేకం. ఉత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులు గుట్ట మీదున్న కాంచన గుహలో కొలువు దీరిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని కిందికి దిగగానే వారికి గుర్తుకొచ్చేది కాల్చిన మటన్. జాతర సందర్భంగా ఇక్కడ ప్రత్యేక మటన్ దుకాణాలు ఏర్పాటవుతాయి. వాటిలో కాల్చిన మటన్ తినేందుకు రాష్ట్రం నుంచే కాక పొరుగునున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చే వారు కూడా ఇష్టపడతారు. కాల్చిన మటన్, మటన్ ఫ్రై ఎక్కడైనా దొరుకుతుంది. కానీ ఎక్కడా లేనంత ప్రత్యేక రుచికరమైన మటన్ ఇక్కడే లభిస్తుంది. అందులో కలిపే ప్రత్యేక మసాలా వల్లే కాల్చిన మటన్‌కు ప్రత్యేక రుచి వస్తుంది.

50 రోజుల ముందే మసాలా తయారీ

కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్‌కు తయారీకి వినియోగించే మసాలా తయారీ కూడా ఒక ప్రత్యేకం జాతరలో మటన్ దుకాణాలను తరతరాలుగా అమరచింత ఆరెకటిక కులస్తులే ఏర్పాటు చేస్తున్నారు. మటన్‌లో కలిపే మసాలా తయారీని వారు దసరా నవరాత్రుల అనంతరం నిష్ఠతో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభిస్తారు. దుకాణం ఏర్పాటు చేసే ప్రతీ వ్యాపారి జాతర నెల రోజుల్లో 100 యాటలు (జీవాలను) కోస్తారు. అందుకోసం 150 కిలోల మసాలాను సిద్ధం చేసుకుంటారు. అందుకోసం కారం 35 కిలోలు, అల్లం 30 కిలోలు, ఎల్లిపాయలు 30 కిలోలు, లవంగాలు, యాలకులు షాజీరా, చెంకా, మిరియాలు, తోక మిరియాలు కిలో చొప్పున అవసరం అవుతాయి. అలాగే రాతి పువ్వు, మరాఠీ మొగ్గ, జాపత్రి, జాజికాయ, బొప్పాయి పూత ఇలా 15 రకాల వస్తువులను మెత్తగా దంచాల్సి ఉంటుంది. ఇలా 15 రకాల దినుసులను కలిపి తయారు చేసిన 150 కిలోల ప్రత్యేక మసాలాను 50 రోజుల వరకు నిల్వ ఉంచుతారు. దీంతో అది మరింత ఘాటుగా మారుతుంది. ఈ మసాలను మటన్ దట్టించి కాల్చుతారు. దీంతో అది ప్రత్యేక రుచిని సంతరించుకుంటుంది.

మసాలాతోనే ప్రత్యేక రుచి

రఘురాం, అమరచింత : కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో మటన్ దుకాణాలను ఏర్పాటు చేయడం అనాదిగా వస్తోంది. ఇందుకోసం కుటుంబ సభ్యులందరం నిష్ఠగా పూజలు చేసి మసాలాను తయారు చేస్తాం. అందుకోసం నాణ్యమైన 15 రకాల దినుసులను వినియోగిస్తాం. ఇలా సిద్ధం చేసుకున్న మసాలాను మటన్‌లో కలిపి కాల్చడం వల్లే అది మరింత రుచికరంగా మారుతుంది.



మసాలాను సిద్ధం చేస్తున్న రఘురాం

వ్యవసాయ క్షేత్రాలా? నీటి అక్రమ వ్యాపార కేంద్రాలా?



వ్యవసాయ క్షేత్రంలోని ఫాం పాండ్‌ను పరిశీలిస్తున్న లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ బృందం

- విస్తుపోయిన లోకాయుక్త బృందం
- పోలేపల్లి పరిసరాల్లో క్షేత్ర స్థాయి విచారణ

జడ్చర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : 'ఇవి వ్యవసాయ క్షేత్రాలా? నీటి అక్రమ వ్యాపార కేంద్రాలా?' అని క్షేత్రస్థాయిలో విచారణకు వచ్చిన లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ అధికారి మ్యాథ్యూకోషి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని పోలేపల్లి పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లోని బోర్ల నీటిని పంటల సాగుకు కాకుండా, సెజ్‌లోని ఫార్మ పరిశ్రమలకు విక్రయిస్తున్నారని, మరికొందరు వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్నారని పోలేపల్లి గ్రామానికి చెందిన మహేష్, రాఘవేందర్‌లతో పాటు మరికొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మాథ్యూకోషి, విచారణ కమిటీ సభ్యులు శివప్రసాద్, రాంరెడ్డిల బృందం మంగళవారం విచారణ చేపట్టింది. పోలేపల్లి పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించింది. ఎకరం భూమి ఉన్న వ్యవసాయ క్షేత్రంలో మూడు, నాలుగు బోర్లు ఉండడం, ఫాంపాండ్ నిర్మాణాలను గుర్తించారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయలేదని, బోర్ల నుంచి నీటిని ఫాంపాండ్‌లో డంప్ చేస్తున్నారని గుర్తించారు. ఆ నీటిని మోటర్ల సహాయంతో వాటర్ ట్యాంకర్లలో నింపి ఫార్మా పరిశ్రమలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మోటర్‌లకు కమర్షియల్ విద్యుత్‌ను కాకుండా, వ్యవసాయ విద్యుత్‌నే వినియోగిస్తున్నట్లుగా తేల్చారు. దీంతో విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లడమే కాకుండా, భూగర్భజలాలు తగ్గిపోతున్నాయని బృందం సభ్యులు వెల్లడించారు.

ఈ విషయంపై విద్యుత్‌శాఖ అధికారికి ఫోన్ చేసి ప్రశ్నించారు. విద్యుత్ దుర్వినియోగం అవుతోందని, ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. విద్యుత్‌శాఖకు అధికారికంగా లేఖను పంపి స్తామని, లోకాయుక్త విచారణకు హాజరు కావాలని సూచించారు. అనంతరం సెజ్‌లోని హెటిరో ఫార్మ పరిశ్రమకు వెళ్లారు. కంపెనీకి అవసరమైన నీటిని ఎక్కడి నుంచి తెప్పించుకుంటున్నారని ఆరా తీశారు. పోలేపల్లి మాజీ సర్పంచ్ ఇంటి నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసుకొని, నీటిని కొనుగోలు చేస్తున్నామని పరిశ్రమల ప్రతినిధులు వారికి తెలిపారు. అంతకుముందు పోలేపల్లి పరిసర ప్రాంతాలలోని వ్యవసాయక్షేత్రాల సర్వే నెంబర్లను జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయ అధికారులతో తీసుకున్నారు. విచారణకు సంబంధించిన పూర్తి నివేదికను లోకాయుక్తకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణలో గిర్దావర్ ఖదీర్‌తో పాటు గ్రామస్థులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

అర్చరీ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 5 : మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 ఎస్జీఎఫ్ అర్చరీ టోర్నీలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థిని సాయి సమీక్ష ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నది. గౌతమ్‌రెడ్డి నాలుగో స్థానంలో నిలిచాడు. గుజరాత్‌లో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి అర్చరీ పోటీల్లో వారిద్దరూ పాల్గొననున్నారు.

పురాతన విగ్రహాలను కాపాడుకోవాలి

- ప్రాచీన ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలి
- పురావస్తు శాఖ పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి
- తాడూరు మండలంలోని ఇంద్రకల్, భూత్పూర్ మండలంలోని కప్పెట గ్రామాల్లో పర్యటన





ఇంద్రకల్‌లోని ఇంద్రేశ్వరాలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, ఆలయంలోని విగ్రహం

తాడూరు/భూత్పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పురాతన విగ్రహాలను కాపాడుకోవాలని, ప్రాచీన ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని పురావస్తు పరిశోధకుడు, పిచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఇంద్రకల్, మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని కప్పెట గ్రామాల్లో పర్యటించారు. ఇంద్రకల్‌లో కాకతీయుల కాలం నాటి పురాతన ఇంద్రేశ్వరాలయాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామస్థులందరూ సహకరించు కొని ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటే ఎంతో అద్భుతంగా ఉంటుందన్నారు. ఈ ఆలయాన్ని దాదాపు ఏడు వందల సంవత్సరాల క్రితం నిర్మించినట్లు తెలిపారు. గుడిలోని మండపాలు, శివలింగం, దేవతా మూర్తులు, మహిషామర్ధిని శిల్పం అద్భుతంగా ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌కు చెందిన ముచ్చర్ల దినకర్, ఎదిరేపల్లి కాశన్నలు ఇచ్చిన సమాచారం మేరకు ఆలయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామస్థులు జానయ్య, తిరుపతయ్య ఉన్నారు. అనంతరం భూత్పూర్ మండలంలోని కప్పెటలో ఆంజనేయస్వామి దేవాలయాన్ని పరిశీలించారు. గుడిలోని 16వ శతాబ్దికి చెందిన వినాయక విగ్రహాన్ని చూశారు. ఇది దాదాపు నాలుగు వందల ఏళ్ల నాటిదని తెలిపారు. అనంతరం గ్రామంలో పునర్నిర్మిస్తున్న శివాలయాన్ని సందర్శించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

దశల వారీగా గ్రామ సమస్యలు పరిష్కారం

● పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి



మరికల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మరికల్ గ్రామ సమస్యలు, అభివృద్ధి దశలవారీగా పరిష్కారం చేస్తున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

గ్రామంలో ఎల్ఆర్ఎస్‌లు ఎన్ని ఉన్నాయి.

4,882 ఎల్ఆర్ఎస్‌లు ఉన్నాయి. అన్నింటిని పరిష్కరించాం.

ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు వచ్చాయి

మార్చి 2024న పీఎఫ్ఎంఎస్ నుంచి రూ.ఆరు లక్షలు వచ్చాయి.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఎలా చెల్లిస్తున్నారు.

గ్రామంలో నుంచి వచ్చే టాక్స్‌ల ద్వారా నెలకు రూ.2 లక్షల 80వేలు చెల్లిస్తున్నాం.

ట్రాక్టర్, ఆటోల నెల ఖర్చు ఎంత

ప్రతీరోజు డీజిల్‌కు, మరమ్మతులకు నెలకు రూ.60 వేలు ఖర్చు చేస్తున్నాం.

పంచాయతీ నెల ఆదాయం ఎంత

పంచాయతీకి టాక్స్ రూపంలో వచ్చే ఆదాయం, కార్మికుల వేతనాలు, ట్రాక్టర్, ఆటో ఖర్చులకు సరిపోతుంది.

న్యూస్ బాక్స్

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం వరి విక్రయానికి వచ్చింది. వడ్లు సోన రకం 597 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ట ధర రూ.2,630, కనిష్ట ధర రూ.2,140, రమారమిగా రూ.2,330 పలికింది. వడ్లు హంస రకం 112.80 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ట ధర రూ.2,635, కనిష్ట ధర రూ.2,020, రమారమి ధర రూ.2,635 పలికింది.

నేటి నుంచి మహాలింగేశ్వర స్వామి జాతర

నారాయణపేట రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగారం గ్రామంలో గుట్టపై వెలసిన మహాలింగరాయ స్వామి జాతరోత్సవాలు బుధవారం నుంచి రెండురోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం బీరప్ప దేవాలయం నుంచి మహాలింగరాయ స్వామి ఆలయం వరకు పల్లకీసేవ, ఊరేగింపు సాయంత్రం జ్యోతి కార్యక్రమం, భజన, రెట్టపట్టు ఉంటాయన్నారు. గురువారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం ఉంటుందని వారు వివరించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం

మాగనూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళంకేరి ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై కొత్తపల్లి పాఠశాలకు వెళ్లిన నరసింహారెడ్డిని మంగళవారం తాళంకేరి గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బలరాం, గురువులింగంపల్లి హెచ్ఎం వినోద్‌కుమార్, సీఆర్పీలు ఎల్లాగౌడ్, కృష్ణయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ రాధిక, సింగిల్ విండో డైరెక్టర్ బాలప్ప, మాజీ ఉప సర్పంచు పెద్ద బాలప్ప, రామకృష్ణ, బస్వరాజ్, శ్యామ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిప్రస్‌పల్లి పాఠశాలలో...

ఊట్కూర్ : ఊట్కూర్ మండలం తిప్రస్‌పల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం పాత, కొత్త ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సుజాత, గీత, గోపాలకృష్ణ, శశికళతో పాటు, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పృథ్వీరాజ్‌లకు స్వాగతం పలుకుతూ శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుమంగళ, ఉపాధ్యాయులు మాణిక్‌ప్రభు, రవి, కుర్వఆనంద్, గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

కోస్గి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తొగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగాపూర్ గ్రామం నుంచి నాచారం వెళ్లే మార్గంలో రోడ్డుపై వరి ఆరబోశారు. తొగాపూర్ గ్రామానికి చెందిన అంజి ద్విచక్ర వాహనంపై ధాన్యం పైనుంచి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే కోస్గి ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో కోడె దూడ మృతి

నారాయణపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కోడె దూడ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని బాహార్‌పేట వీధిలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత రైతు గొల్ల పెంటప్ప తెలిపిన వివరాల ప్రకారం.. పొలంలో మంగళవారం పశుగ్రాసం మేసే సమయంలో కర్రకు వేలాడుతున్న విద్యుత్ వైర్ కోడె దూడకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే చనిపోయింది. ఘటనపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

రెవెన్యూ గ్రామంగా మారేనా..

» ఆరు గ్రామాల శివారులో రైతుల భూములు

» తప్పని ఇబ్బందులు, పట్టించుకోని అధికారులు



అప్పంపల్లి గ్రామ ముఖ చిత్రం

మరికల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తరాలు మారినా అప్పంపల్లి తలరాత మారడం లేదు. ఎందరో సర్పంచ్‌లు, ఎందరో అధికారులు, ఎమ్మెల్యేలు మారుతున్నా అప్పంపల్లికి రెవెన్యూ గ్రామ హోదా దక్కడం లేదు. రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని తహసీల్దార్ నుంచి ముఖ్యమంత్రి వరకు ఎన్నో వినతిపత్రాలను ఇచ్చినా గ్రామం తలరాత మాత్రం మారడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

వివరాలు ఇలా..

1975లో అప్పంపల్లి గ్రామ పంచాయతీగా అవతరించింది. గ్రామంలో 450 కుటుంబాలు ఉండగా 22,500 మంది జనాభా ఉన్నారు. ఇక్కడ ప్రతీ ఇంటికి రైతులు ఉన్నారు. 2,511 ఎకరాలు ఈ గ్రామంలోని రైతుల పేరిట భూములు ఉన్నాయి. 150 ఎకరాలు ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉంది. మూడు చెరువులు, ఐదు కుంటలు, ఎనిమిది చెక్‌డ్యామ్‌లు గ్రామ పరిధిలో ఉన్నాయి. గ్రామ శివారులో 1,020 ఎకరాలు, పసుపుల గ్రామ శివారులో 715, మందిపల్లి శివారులో 413, మాద్వార్ శివారులో 212, ధన్వాడ శివారులో 101, రాంకిష్టయ్యపల్లి శివారులో 50 ఎకరాలతో మొత్తం 2,511 ఎకరాల భూమి ఉంది. 95 శాతం అక్షరాస్యత సాధించిన గ్రామంగా రికార్డు ఉంది. ఉన్న భూములు ఆరు రెవెన్యూ గ్రామాల శివారుల్లో ఉండటం వల్ల గ్రామానికి రెవెన్యూపరంగా వచ్చే ఆదాయానికి గండి పడుతోంది. రెవెన్యూ సదస్సులు, బ్యాంకు రుణాలు, పంట నష్ట పరిహారం, ఏమైనా భూసమస్యలతో పాటు చివరకు భూములు కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా అధికారులను సంప్రదించాల్సిన దౌర్భాగ్యం ఏర్పడింది. ఏడు మంది సర్పంచ్‌లు, ఎంతోమంది అధికారులు మారినా రెవెన్యూ గ్రామంగా మార్చే నాథుడే కరవయ్యాడు.

రెవెన్యూ ఆదాయం ఇతర గ్రామాలకు వెళ్తోంది..



అప్పంపల్లిని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించకపోవడం వల్ల గ్రామానికి వచ్చే ఆదాయం ఇతర గ్రామాలకు పోతోంది. ఆరు రెవెన్యూ గ్రామాల శివారులో తమ రైతుల భూములు ఉండటం వల్ల శిస్తులు, క్రయ విక్రయాలు జరిగినా రెవెన్యూ పరంగా వచ్చే ఆదాయానికి గండి పడుతోంది. తమ కంటే చిన్న గ్రామాలు రెవెన్యూ గ్రామాలుగా అభివృద్ధి చెందుతున్నాయి.

- కృష్ణారెడ్డి, రైతు

రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి..



రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించాం. కానీ నేటివరకు స్పందన లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించి వచ్చే ఆదాయంతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలి.

- సంజన్నగారి వెంకట్‌రెడ్డి, రైతు

సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం

» జిల్లాలో 1,55,894 నివాసాలు, 1,193 బ్లాకులు

» 1,170 మంది ఎన్యుమరేటర్లు, 118 మంది సూపర్‌వైజర్ల నియామకం



సర్వేపై జరిగిన శిక్షణలో అవగాహన కల్పిస్తున్న అధికారి

నారాయణపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచార సేకరణతో సమగ్ర ఇంటింటి సర్వేకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు కలెక్టర్ బెన్‌షాలం ఆధ్వర్యంలో జిల్లా ప్రణాళిక అధికారి ఎస్.యోగానంద్ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యంత్రాంగం బుధవారం నుంచి ఇంటిబాట పట్టనున్నారు. బుధ, గురువారాల్లో రెండు రోజులు ముందు కుటుంబాలను గుర్తిస్తారు. ఆ తర్వాత 56 అంశాలకు సంబంధించి 19 అనుబంధం కలిపి మొత్తం 75 ప్రశ్నలతో సమగ్ర సమాచారం సేకరిస్తారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 280 గ్రామ పంచాయతీలు, మూడు మునిసిపాలిటీలకు గాను జిల్లాలో 1,55,894 నివాసాలు, 1,193 బ్లాకులు ఉన్నాయి. సర్వే కోసం 1,170 మంది ఎన్యుమరేటర్లు, 118 మంది సూపర్‌వైజర్లకు తోడు పది శాతం అదనపు సిబ్బందితో మొత్తం 1,432 మంది సర్వేలో పాల్గొననున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాసాలు 1,31,174 ఉండగా 1,009 బ్లాక్‌లు, 986 మంది ఎన్యుమరేటర్లు, 99 మంది సూపర్‌వైజర్లను నియమించారు. మూడు మునిసిపాలిటీలు కోస్గి, మక్తల్, నారాయణపేట పరిధిలో 24,720 నివాసాలకు 184 బ్లాక్‌లు, ఎన్యుమరేటర్లు 184 మంది, 19 మంది సూపర్‌వైజర్లను నియమించి అందరికీ సర్వే ఫారాలు అందించారు. ఎన్యుమరేటర్లను ఎంపీడీవోలు పర్యవేక్షిస్తారు. సేకరించిన సర్వే నివేదికలు ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు 303 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. అందులో 117 మంది ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్లు, 85 మంది మీసేవా ఆపరేటర్లు, 71 మంది సిటిజన్ సర్వీస్ సెంటర్స్ నుంచి తీసుకున్నారు. రోజుకు పది ఇళ్లు సర్వే చేసే అవకాశం ఉంటుంది. సర్వేలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏ, ఎంఆర్సీ సిబ్బంది, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను నియమించారు. ప్రతీ మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించి, పర్యవేక్షించేలా చూడనున్నారు. నారాయణపేట జిల్లా కోడ్ 33 ఉండగా మండలాలకు కూడా ఒక కోడ్ కేటాయించారు. సర్వే ఫారంలో కోడ్ పేర్కొంటారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ బెన్‌షాలం ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం సర్వేకు అన్ని ఏర్పాట్లు చేశాం. సర్వేలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం. ఇంటికి వచ్చే సిబ్బందికి కుటుంబ సభ్యులు సమగ్ర సమాచారం అందించి, సహకరించాలి.

-ఎస్.యోగానంద్, జిల్లా ప్రణాళిక అధికారి నారాయణపేట.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

- కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎ.తిరుపతిరెడ్డి

- మద్దూర్, కోస్గి, కొత్తపల్లి మండలాల్లోని చెరువుల్లో చేప పిల్లల వదిలివేత



మద్దూర్ కాచెరువులో చేపపిల్లలను వదులుతున్న అధికారులు, నాయకులు

మద్దూర్/కోస్గి/కొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎ.తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మద్దూర్ గ్రామ శివారులోని కాచెరువుతో పాటు, కోస్గి మునిసిపల్ పరిధిలోని నాగుల చెరువు, కొత్తపల్లి మండలం మన్నాపూర్ చెరువులో మత్స్యశాఖ ఏడీ ఎస్ఏ.రహ్మాన్‌తో కలిసి చేప పిల్లలను వదిలారు. అనంతరం ఆయా చోట్ల ఏర్పాటు చేసిన సమావేశాల్లో తిరుపతిరెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో ఎంపికైన చెరువులో సంఘాల ఆధ్వర్యంలో చేప పిల్లలను వదులుతున్నామన్నారు. మద్దూర్‌లో మత్స్యకారులు తిరుపతిరెడ్డితో పాటు, ఏడీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాడా అధికారి వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సంజీవ్‌కుమార్, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, మండల మత్స్యకార సంఘం సభ్యులు, మండల అధికారులు పాల్గొన్నారు.

కోస్గిలోని నాగులచెరువులో చేపపిల్లలను వదిలిన అనంతరం స్థానిక 13వ వార్డులో హైమాస్ట్ లైట్లను తిరుపతిరెడ్డి ప్రారంభించారు. అలాగే, 11వ వార్డులో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు పరిశీలించారు. గుండుమాల్ గ్రామంలో కాడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి, మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ భాస్కరస్వామి, మునిసిపల్ కమిషనర్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి, మునిసిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోట్ల మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, విజయ్ కుమార్, తిరుపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు

నారాయణపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఆర్టీసీ డిపో నుంచి కార్తీక పౌర్ణమి ఈనెల 15న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతామని డిపో మేనేజర్ లావణ్య మంగళవారం తెలిపారు. ఈనెల 13న సాయంత్రం ఏడు గంటలకు నారాయణపేట బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి ఉదయానికి ఏపీలోని కాణిపాకం విఘ్నేశ్వరుని, వెల్లూరులోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి దర్శనం అనంతరం 14న సాయంత్రం ఏడు గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 15న మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరి 16న ఉదయం ఎనిమిది గంటలకు నారాయణపేటకు చేరుకుంటుందన్నారు. ఒక్కరికి టూర్ ప్యాకేజీ కింద రూ.3900 చెల్లించాలని ఆర్టీసీ సంస్థ నిర్ణయించిందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు. రిజర్వేషన్ కోసం 7382826109 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని డీఎం కోరారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

మాగనూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై అశోక్‌బాబు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై ఆయన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారుల కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించొద్దని, ఎవరైనా అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపొద్దని, రోడ్డుపై పార్కింగ్ చేయొద్దన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు డయల్ కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూనీడు, నిడ్జింత, గోర్లొనిబాయి గ్రామాలతో పాటు, మద్దూర్ మండలంలోని దోరేపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గూళ్ల నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీమప్ప, డైరెక్టర్ సూర్యప్రకాష్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రఘుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, నిడ్జింత విజయ్‌కుమార్ రాజశేఖర్‌రెడ్డి, ఏపీఎం నారాయణ, సీసీలు, బుక్‌కీపర్లు పాల్గొన్నారు.

సమాజంలో పాత్రికేయుల సేవలు మహోన్నతమైనవి

నారాయణపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పాత్రికేయుల సేవలు మహోన్నతమైనవని గౌడ సంఘం జిల్లా నాయకుడు మనోహర్‌ప్రసాద్‌గౌడ్ అన్నారు. టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కె.నారాయణరెడ్డికి స్థానిక బాల కేంద్రంలో మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్, సంగ నర్సింహులు, చంద్రశేఖర్, డిజిటల్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘు గణప, నక్క శ్రీనివాస్ ఉన్నారు.

చిరుతపులుల బెడద నుంచి రైతులు, పశువులను కాపాడాలి

నారాయణపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్దూరు, దామరగిద్ద, నారాయణపేట పరిసర ప్రాంతాల్లో చిరుతపులులు తరచూ పశువులపై దాడి చేయడంతో పాటు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని వీటి నుంచి రక్షణ కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. పేట మండలం గనిమోనిబండ తండాలో రైతు వెంకటప్పకు చెందిన మేకలపై చిరుత దాడి చేయగా మేకలు మృత్యువాత పడ్డాయన్నారు. అలాగే వత్తుగుండ్లలో శంకర్‌నాయక్‌కు చెందిన మేకలను గాయపర్చినట్లు తెలిపారు. చిరుత దాడిలో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని అంజిలయ్య డిమాండ్ చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేత

మక్తల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు కొత్త శ్రీనివాస్‌గుప్తా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్‌కు అందించారు. మక్తల్ మాజీ ఉప సర్పంచ్ కట్టసురేష్‌కుమార్ ఉన్నారు.

పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు అవకాశమివ్వొద్దు

- కలెక్టర్ సిక్తా పట్నాయక్ - ఊట్కూర్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం తనిఖీ



ఊట్కూర్ సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద పత్తి తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఊట్కూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం ఊట్కూర్ మండల కేంద్ర సమీపంలోని విజయ కాటన్ ఇండస్ట్రీస్ వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రైతుల వద్ద పత్తి కొనుగోలు జరగాలని అన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో అమ్మని రైతులకు ప్రైవేటు కొనుగోలులో కూడా నష్టం జరగకుండా చూడాలన్నారు. అంతకుముందు మిల్లులో రైతులతో మాట్లాడి ధర, విక్రయ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. మిల్లులో ప్రవేశం మొదలు తేమ శాతం పరీక్ష పరిశీలన, తూకం, విక్రయం ధర, రైతుల వేలిముద్రతో కూడిన ఆధార్ అనుసంధానం, ఓటీపీ విధానాన్ని కంప్యూటర్‌లో ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి రైతులకు ఎన్ని రోజుల్లో డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జాన్‌సుధాకర్, సీసీఐ అధికారి ఆకుల అవినాష్, ఏవో గణేష్‌రెడ్డి, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

మాతృమరణాలను తగ్గించాలి : కలెక్టర్

నారాయణపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాతృమరణాలను తగ్గించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మాతృ మరణాల సంఖ్యను తగ్గించే అంశంపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించి, మాట్లాడారు. ఏఎంసీ పరీక్షల సమయంలో ఏమైనా ఆరోగ్య ఇబ్బందులు ఉంటే గమనిస్తారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఆసుపత్రిలో గైనిక్ వైద్యులు గర్భిణులకు పరీక్షలు చేసి పూర్తి వివరాలు నమోదు చేయడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలను వివరించాలన్నారు. గర్భిణులకు వైద్యపరంగా ఎలాంటి సూచనలు, సలహాలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీ, సీహెచ్‌సీల వారిగా మాతృ మరణాలపై సమీక్ష చేసి మాట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.సౌభాగ్యలక్ష్మీ, డాక్టర్ శైలజ, డాక్టర్ వై.మల్లికార్జున్, నర్సింహారావు సగరి, శ్రీలత, గోవిందరాజు తదితరులున్నారు.

నామినల్ రోల్స్ తప్పులు లేకుండా పంపాలి : డీఈవో

నారాయణపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నామినల్ రోల్స్ తప్పులు లేకుండా పంపాలని డీఈవో అబ్దుల్‌ఘనీ అన్నారు. మంగళవారం ఆదర్శ బీఈడీ కాలేజీలో నామినల్ రోల్స్ యూ డైస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల పూర్తి వివరాలు, ఆధార్ వివరాలు పంపించాలన్నారు. యూ డైస్ ఫాంలను పూర్తిగా నింపి పంపించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కేజీబీవీ, టీఎస్ఎంఎస్, ఏడీఈవో పాఠశాలల్లో ప్రహరీ కమిటీలు, ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రత్యేక అధికారి నాగార్జునరెడ్డి, డీఎస్‌వో భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ



నేరడుగం ఉపాధి హామీ గ్రామసభలో చేయనున్న పనులకు తీర్మానాలు చేస్తున్న ఎంపీడీవో

మాగనూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడుగం గ్రామంలో ఉపాధి హామీ పనులపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఎంపీడీవో రహమతుద్దీన్ మాట్లాడుతూ స్థానిక కూలీలతో పనులు చేయించాలని, చేసిన పని నాణ్యతతో ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పాటు కాలువలు, మట్టి రోడ్లు తదితర పనులకు గ్రామస్థుల సమక్షంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఏపీవో హర్షవర్ధన్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీం ప్రధాన లక్ష్యం : ఎస్పీ

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణే షీ టీం ప్రధాన లక్ష్యమని ఎస్పీ యోగేష్‌గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వల్ల గాని, ఇతర వేధింపుల వల్ల గాని ఇబ్బందులు ఎదుర్కొంటే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలన్నారు. జిల్లా మహిళల రక్షణ కోసం షీటీం, యాంటి ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా షీ టీం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 8712670398 నెంబర్‌కు, డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

దామరగిద్ద, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆపరేషన్ మెరిసి ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.హాజమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వత్తుగండ్ల గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు నైపుణ్యత, స్కిల్స్ కలిగి ఉండాలనే ఉద్దేశంతో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామని, మహిళలందరు వినియోగించుకోవాలని సూచించారు. దళిత సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, జిల్లా అధ్యక్షుడు గజలప్ప, మార్కెట్ కమిటీ సభ్యుడు వెంకటప్ప, అంగన్‌వాడీ టీచర్లు శశికళ, వెంకటమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ మాణిక్యప్ప, పంచాయతీ కార్యదర్శి జి.వెంకటప్ప, ఓఎంఐఎఫ్ సంస్థ సభ్యులు ఆశమ్మ, కృష్ణవేణి, శాలిని, ఇందిర, సంతోష, కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం టీచర్ అనసూయ, మండల కళాకారుడు లాలప్ప తదితరులున్నారు.

సమగ్ర సర్వేను విజయవంతం చేయాలి

- ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం బుధవారం నుంచి చేపట్టనున్న సమగ్ర కులగణన సర్వేలో సమగ్ర సమాచారం అందించి విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్ కోరారు. మంగళవారం నారాయణపేట సిటిజన్ క్లబ్‌లో జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులంలోని ఉప కులాలైన బెస్త, ముత్తిరాశి, తెలుగోళ్లు అని వివిధ ఉపకులాల పేర్లు నమోదు చేయకుండా ముదిరాజ్ కులమని ఎన్యుమరేటర్లకు చెప్పి రాయించాలన్నారు. కుల గణనతో బీసీ రిజర్వేషన్‌తో లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మల్లికార్జున్, ఆంజనేయులు, మిర్చి వెంకటయ్య, కాకర్ల భీమయ్య, రాము, లక్ష్మన్, కతలప్ప, వెంకట్రాములు, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

పేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతలు వెంటనే ప్రారంభించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి

మక్తల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడ్డ నారాయణపేట జిల్లాలో ఎత్తిపోతలు ప్రారంభిస్తే ఈ జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. అంతేకాకుండా జిల్లాలో బీఎడ్, ఇంజనీరింగ్ కళాశాలలు, మునిసిపల్ కేంద్రాల్లో వృత్తి విద్య కళాశాలలు ఏర్పాటుచేయాలని, చెక్‌డ్యాంల నిర్మాణాలు, డబుల్ రోడ్లు నిర్మించాలన్నారు. మక్తల్‌ను రెవిన్యూ డివిజన్ చేయాలన్నారు.

సీపీఎం జిల్లా కార్యవర్గం ఎన్నిక

సీపీఎం జిల్లా ద్వితీయ మహాసభల్లో నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గోపాల్, అంజలన్నగౌడ్, పుంజనూరు ఆంజనేయులు, బలరాం, జిల్లా కమిటీ సభ్యులుగా గోవిందరాజు, కాశప్ప, నరహరి, అశోక్, బాలప్ప, నర్సప్ప, బలరాం, మొహ్మద్ అలీ, శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.